క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం



చిట్యాల: టేకుమట్ల మండలంలోని అంకుషాపూర్ గ్రామ శివారు చలివాగు నుంచి ఏలాంటి అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్‌లను చిట్యాల శివారులో స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై షాఖాన్ శుక్రవారం తెలిపారు. ఈ మేరకు అంకుషాపూర్ గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ చింతిరెడ్డి దామోదర్‌రెడ్డి, ఓనర్ పండుగ అజేయ్, అలాగే నేరేడుపల్లి గ్రామానికి చెందిన దువ్వాల ఉమేష్‌లను ఆదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది ఎం.యాకయ్య, లాల్‌సింగ్, అస్లాం జానీ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



కన్నాయిగూడెం: మండలంలోని రెవెన్యూ కార్యాలయంలో ఎమ్మెల్యే సీతక్క అధికారులతో కలిసి శుక్రవారం కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ రామ్ సింగ్, ఎంపీపీ జనగం సమ్మక్కతో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఫణిచంద్ర, జెడ్పీటీసీ కరన్ చందు గాంధీ, వైస్ ఎంపీపీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

వెంకటాపురం(ఎం): రాష్ట్ర స్థాయి సీఎం కప్ బాక్సింగ్ పోటీలకు మండలానికి చెందిన నలుగురు బాక్సింగ్ క్రీడాకారులు ఎంపికైనట్లు బాక్సింగ్ కోచ్ మామిడిపెల్లి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22 నుంచి 24 వరకు ఏటూరునాగారంలో జరిగిన జిల్లా స్థాయి సీఎం కప్ బాక్సింగ్ పోటీలలో మండల కేంద్రానికి చెందిన జన్ను ప్రవీణ్ 48కేజీల విభాగంలో, చంటి వివేక్ 51 కేజీల విభాగంలో, మామిడిపెల్లి సిద్దు 57 కేజీల విభాగంలో అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి సీఎం కప్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అలాగే బాలికల విభాగంలో మంగపేట మండలం కమలాపురం గ్రామానికి చెందిన కొత్తపేట మాధురి 48 కేజీలల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వెల్లడించారు. బాక్సింగ్ క్రీడాకారులు ఈ నెల 28 నుంచి 30 వరకు హైదరాబాద్ లోని ఎల్బీ (లాల్ బహుదూర్) స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సీఎం పోటీలలో పాల్గొననున్నట్లు తెలిపారు. డీవైఎస్‌ఓ రమణ చారి, ఎంపీడీఓలు శ్రీనివాస్, శ్రీధర్, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

ర్యాపిడ్ ఫీవర్ సర్వే

మంగపేట: మండలంలోని దోమెడలో బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కారం నిఖిల్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించారు. గ్రామంలో జ్వరపీడితుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్న దృష్ట్యా జ్వరాలను కట్టడి చేసేందుకు గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి జ్వర పీడితుల నుంచి రక్త నమూనాలను సేకరించి మందులను పంపిణీ చేశారు. జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య సూత్రాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు విశ్రావణ్, హెల్త్ ఎడ్యుకేటర్ జయశ్రీ, ఆశ వర్కర్ నళిని పాల్గొన్నారు.

ఇసుక క్వారీ నిర్వహణకు 'పెసా' గ్రామసభలు



మంగపేట: మండలంలోని చుంచుపల్లి, మల్లూరులో గోదావరిలో ఇసుక క్వారీ నిర్వహణకు ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పెసా గ్రామ సభలు ఎంపీఓ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్, మండల స్పెషలాఫీసర్ తుల రవి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. చుంచుపల్లిలోని 03, 04 వ ఇసుక క్వారీల నిర్వహణ బాధ్యతలు చెంచులక్ష్మి ఇసుక క్వారీ సొసైటీకి, 05వ క్వారీ నిర్వహణను నర్సింహాస్వామి ఇసుక సొసైటీకి అప్పగించేందుకు తీర్మానం చేశారు. అదే విధంగా మల్లూరులో సమ్మక్క-సారలమ్మ సొసైటీకి ఇసుక, మొరం క్వారీ నిర్వహణ బాధ్యతలు అప్పగించేదుకు తీర్మానించారు. కార్యక్రమంలో పెసా జిల్లా కోఆర్డినేటర్ కొమరం ప్రభాకర్, చుంచుపల్లి గ్రామ పంచాయతీ ప్రత్యేకధికారి పాడి వాసుదేవరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సాంబమూర్తి, మల్లూరు గ్రామ పంచాయతీ ప్రత్యేకధికారి విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ఎల్లస్వామి ఆయా గ్రామాల పెసా మొబిలైజర్లు, సొసైటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



పంచాయతీ భవనం, హెల్త్ సబ్‌సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

మొగుళ్లపల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అమ్మ గార్డెన్స్‌లో భారత రాష్ట్ర సమితి జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి అధ్యక్షతన పార్టీ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండలంలో గడిచిన రెండు దఫాలుగా ఎంతో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో నిధులను తీసుకొచ్చి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. మారుమూల గ్రామాలకు లింక్ రోడ్డు వేసుకొని, పరకాల నుంచి మొగుళ్లపల్లికి డబుల్ రోడ్డు నిర్మించినట్లు తెలిపారు. అలాగే మండలంలో చెక్ డ్యాములు తదితర వ్యవసాయ అవసరాల అంశాలను దిగ్విజయంగా పూర్తి చేసుకున్నామని గ్రామస్థాయిలో పార్టీ కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలు లేకున్నా ప్రజాసంక్షేమ కోసం రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. మండలంలో పాత, కొత్త అనే వర్గం ఏనాడు రాదు, రాబోదు అందరం కలిసికట్టుగా భారత రాష్ట్ర సమితి జెండా కింద పని చేద్దామని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీ ఇచ్చే మండలంలో మొగుళ్లపల్లి ముందు వరుసలో ఉండాలన్నారు. అదాని అంబానీలకు కొమ్ము కాస్తూ ప్రశ్నించే రాష్ట్రాలపై ఈడీ, సీబీఐలతో రాజకీయం చేస్తున్న బీజేపీకి ప్రజలందరూ తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యారసుజాతసంజీవరెడ్డి, జెడ్పీటీసీ జోరుక సదయ్య, మండల పార్టీ అధ్యక్షుడు బల్గూరి తిరుపతిరావు, సర్పంచ్‌లు ఫోరం మండల అధ్యక్షుడు చదువు అన్నారెడ్డి, వైస్ ఎంపీపీ పోల్నేని రాజేశ్వర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ సంపెల్లి నర్సింగరావు, ఎనుమాముల మార్కెట్ డైరెక్టర్ పిన్నింటి వెంకట్‌రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మండలంలోని, పిడిసిల్ల, కాసులపహడ్, బంగ్లాపల్లి, మొగుళ్లపల్లి, అంకుషాపూర్, ఇస్సిపేట, రంగాపూర్ గ్రామాల్లో రూ.2 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గండ్ర వెంకటమణారెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. గుండ్లకర్తి గ్రామంలో ఇటీవల కురిసిన గాలివానకు ఇంటిపై కప్పులు ధ్వంసమైన ఇళ్లను పరిశీలించారు. రెవెన్యూ శాఖ అధికారులు ఘటన స్థలాలను పరిశీలించి బాధితులకు ప్రభుత్వపరమైన ఆర్థిక సాయం అందేలా చర్యలు చేపట్టాలని ఫోన్ ద్వారా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణవేణి, మండల వైద్యాధికారి నాగరాణి, ఎంపీఓ వినోద్‌కుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

మండలంలోని అంకుషాపూర్ గ్రామానికి చెందిన దేవేందర్, రంగాపూరం గ్రామానికి చెందిన లోకుల బోయిన శ్రీను ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



మల్హర్: వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ సిబ్బంది



కనుకునూర్‌లో వినతిపత్రం అందజేస్తున్న వర్కర్లు

మహాముత్తారం: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న వర్కర్లు శుక్రవారం కనుకునూర్, పెగడపల్లి గ్రామాల్లో కార్యదర్శులు, సర్పంచ్‌లకు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కారోబార్లు, బిల్‌కలెక్టర్లు, ఎలక్ట్రిషియన్స్, వాటర్‌మెన్లు తదితరులు పాల్గొన్నారు.

మల్హర్: మండలంలోని అన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన పంచాయతీ కార్మికులు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. కార్యదర్శికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలో పని చేస్తున్న సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, సిబ్బంది వేతనాల కోసం ప్రత్యేక గ్రాంటును కేటాయించాలని కోరారు. జీఓ 51ను సవరించి, మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కారోబార్, బిల్ కలెక్టర్‌కు స్పెషల్ స్టేట్ కల్పించి పంచాయతీ అసిస్టెంట్‌గా నామకరణం చేయాలని విన్నవించారు. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం కల్పించి, 8గంటల పనిదినాలు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కారోబార్ శ్రీకాంత్, సిబ్బంది మల్లయ్య, మొగిళి, సమ్మయ్య, స్వామి పాల్గొన్నారు.

'ఉపాధి'ని సద్వినియోగం చేసుకోవాలి



మల్హర్: కూలీలకు సూచనలిస్తున్న ఎంపీడీఓ నర్సింహమూర్తి

పలిమెల: ఉపాధిహామీని పనులను సద్వినియోగం చేసుకోవాలని ఈజీఎస్ జిల్లా అధికారులు నితిన్, నాగేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు, మండలంలోని ముకునూరు, పంకెనలో ఉపాధిహామీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొలత ప్రకారం పని చేస్తే తగిన కూలీ వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రకాష్‌రెడ్డి, పీఓ సునీత, ఈసీ శ్రీకాంత్, టీఏలు ప్రశాంత్, సాంబశివుడు, సర్పంచ్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

పనుల పరిశీలన

మల్హర్: మండలంలోని మల్లారం గ్రామంలో ఉపాధిహామీ పథకం ద్వారా చేపడుతున్న పనులను ఎంపీడీఓ నర్సింహమూర్తి శుక్రవారం పరిశీలించారు. కూలీలకు పలు సూచనలు చేశారు. కొలతల ప్రకారం పనులు చేస్తే రూ.272 పొందవచ్చని వివరించారు. అనంతరం గ్రామంలోని మల్టీలేయర్ రెవెన్యూ ప్లాంటేషన్, నర్సరీలను సందర్శించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటం వలన నర్సరీలోని మొక్కలకు ఉదయం, సాయంత్రం వాటరింగ్ చేయాలని, ఎత్తగా ఉన్న మొక్కలకి షిఫ్టింగ్ గ్రేడింగ్ చేయాలని వాచర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ గిరి హరీష్, ఫీల్డ్ అసిస్టెంట్ మన్నెపల్లి సుమలత తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మల్హర్: ర్యాలీ నిర్వహిస్తున్న పంచాయతీ సిబ్బంది



మహదేవపూర్: వ్యర్థాలను తొలగిస్తున్న ప్రజాప్రతినిధులు

మల్హర్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీఓ నరసింహమూర్తి పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మల్లారం గ్రామంలో ప్లాస్టిక్ వలన కలిగే కాలుష్యంపై ఎంపీడీఓ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని గ్రామస్తులకు సూచించారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి రాజు, అంగన్‌వాడీ టీచర్స్, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యర్థాల తొలగింపు

మహదేవపూర్: పర్యావరణహిత జీవనశైలి కార్యక్రమంలో భాగంగా ఎంపీపీ రాణీబాయి ఆధ్వర్యంలో శుక్రవారం ఎర్ర చెరువులో గల వ్యర్థాలను తొలగించారు. చెరువులోని ప్లాస్టిక్ వ్యర్థాలతో పాటు చెరువులోని పాలసంద్రము మొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ అరుణ, ఎంపీడీఓ రవీంద్రనాథ్, సర్పంచ్ శ్రీపతి బాపు, ఎంపీఓ ప్రసాద్, ఏపీఓ రమేష్, కార్యదర్శి సమ్మయ్య, గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

పలిమెల: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో మిషన్ లైఫ్ క్యాంపెనింగ్‌లో భాగంగా శుక్రవారం లేక్ క్లీనింగ్(చెరువుల శుద్ధి) కార్యక్రమాన్ని లేక్ క్లీనింగ్ అధికారి ఆలం నాగయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువుల్లో ప్లాస్టిక్ నిల్వలను తొలగించడమే ప్రధాన లక్ష్యమని, చెరువులు, కుంటలలో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను నివారించాలన్నారు. ప్లాస్టిక్ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి, ఏపీఓ సునీత, స్థానిక సర్పంచ్ జవాజి పుష్పలత, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, తదితరులు ఉన్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

మహదేవపూర్: రైతులకు రాయితీపై జీలుగ విత్తనాలను మహదేవపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)లో అందుబాటులో ఉన్నాయని ఏఓ ప్రభావతి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జీలగ విత్తనాలను పొలంలో చల్లి 45 రోజుల తర్వాత పూత దశలో నేలలో కలియదున్ని మురగదమ్ము చేసినట్లయితే భూమి సారం పెరుగుతుందని తెలిపారు. 30 కిలోల బస్తాకి రైతులు రూ.842 చెల్లించవలసి ఉంటుందని వివరించారు. విత్తనాలు కావలసిన రైతులు పట్టా పాస్‌బుక్, ఆధార్ కార్డుతో మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

పరామర్శ



పరామర్శిస్తున్న గండ్ర జ్యోతి

టేకుమట్ల (రేగొండ): రేగొండ మండలంలో పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాను వరంగల్ రూరల్ జెడ్పీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి శుక్రవారం పరామర్శించారు. అనంతరం ఆర్థిక సాయం అందజేశారు. అలాగే రేపాక మాజీ సర్పంచ్ పగడాల ఐలయ్య సతీమణి పగడాల వసుమతి దేవి సంవత్సరికానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వసుమతి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గొర్లవీడులో..



పరామర్శిస్తున్న వాసుదేవరెడ్డి

భూపాలపల్లి రూరల్: మండలంలోని గొర్లవీడు గ్రామానికి చెందిన పింగిలి రాజిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి శుక్రవారం పరామర్శించారు. తిరుపతిరెడ్డి, రవీందర్‌రెడ్డి, భూపాలపల్లి మండల బీఆర్ఎస్ కార్యదర్శి బొనగాని రమేష్ గౌడ్ తదితర నాయకులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



చిట్యాల: ఆర్థిక సాయం అందిస్తున్న మిత్రులు



కాటారం: ఆర్థిక సాయం అందజేస్తున్న రాజయ్య

చిట్యాల: మండలంలోని శాంతినగర్‌కు చెందిన చింతనిప్పుల దశరథం ఇల్లు ఇటీవల ప్రదవశాత్తు కాలిపోయింది. దీంతో బాధితుడితో కలిసి పదవ తరగతి చదువుకున్న మిత్రులు శుక్రవారం రూ.11వేల ఆర్థిక సాయం అందజేశారు. నేరెళ్ల ఒదేలు, క్యాతం రమేష్, శరత్‌బాబు, జీడి సదానందం, రాంబాబు, కె.సదనందం, సిద్దంకి భాస్కర్, దేవ సతీష్, జిల్లెల సంపత్, అమనగంటి రాజు, టి.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కాటారం: మండల కేంద్రానికి చెందిన పల్లకొండ సమ్మయ్య, సుమలత దంపతులు ఇటీవల మృతి చెందారు. దీంతో వారి ఇద్దరు పిల్లలు అనాథలుగా మారడంతో ఎరుకుల సంఘం నాయకులు శుక్రవారం పరామర్శించి రూ.2వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కేతిరి రాజు, మండల అధ్యక్షుడు కేతిరి సదయ్య, ప్రధాన కార్యదర్శి పులిచేరి సంపత్, రాయమల్లు, రాజయ్య, దుర్గారావు, సమ్మయ్య పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

మహదేవపూర్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని హెల్త్ ఎక్స్టెంషన్ ఆఫీసర్ స్వామి అన్నారు. శుక్రవారం డ్రై డే లో భాగంగా ఎస్సీ కాలనీలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. నీటిని నిల్వలు లేకుండా చూడాలన్నారు. డ్రమ్ములు, కుండలపై మూతలు అమర్చుకోవాలని, కొబ్బరిబోండాలు, టైర్లు, వాడని కుండలు, డబ్బాలు, బోర్లించాలని అన్నారు. మలేరియా, డెంగీ, ఫైలేరియా, మెదడువాపు తదితర వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. హెల్త్ అసిస్టెంట్ అడపరాజరమణయ్య, ఏఎన్ఎం హేమలత, వెంకటమ్మ, ఆశ వర్కర్స్ రుద్ర, మాధవి, శైలజ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

మొక్కజొన్న పంట దగ్ధం



దగ్ధమవుతున్న మొక్కజొన్న పంట



ప్రమాదానికి కారణమైన బల్లి

టేకుమట్ల: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మొక్కజొన్న పంట దగ్ధమైన సంఘటన మండలంలోని బండపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధిదిత రైతు ఆరె కుమారస్వామి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ట్రాన్స్‌ఫార్మర్‌పై బల్లి పడడంతో నిప్పులు లేచి మొక్కజొన్న పంటలో పడ్డాయన్నరు. దీంతో రెండెకరాల మొక్కజొన్న మంటల్లో దగ్ధమైందని ఆవేదన వ్యక్తం చేశారు. దాంతో పాటు పంటలోని పైపులు, డ్రిప్ సైతం కాలిపోయినట్లు తెలిపారు. సుమారు రూ.1.5లక్షల నష్టం వాటిల్లిందని, ఆరుగాలం కష్టపడి పండించిన పంట అగ్నికి ఆహుతి కావడంతో అప్పులే మిగిలాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే ఆదుకోవాలని బాధిత రైతు వేడుకుంటున్నాడు.

నేడు ప్రారంభం

చిట్యాల: మండల కేంద్రంలో నూతనంగా క్రీడా ప్రాంగణం, అంబేడ్కర్ నూతన భవనాన్ని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయిని పల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సిరెడ్డి చేతుల మీదుగా నేడు(శనివారం) ప్రారంభం చేయనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు ఆరెపల్లి మల్లయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావున మండలంలోని నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

అంబులెన్స్‌కు అనారోగ్యం!

టేకుమట్ల: అత్యవసర సమయంలో ఆదుకునే 108 అంబులెన్స్ టైర్ శుక్రవారం ఊడిపోయింది. ఉదయం విధుల్లో భాగంగా టేకుమట్ల నుంచి చిట్యాలకు వెళ్తున్న క్రమంలో ప్రయాణంలోనే వాహనం వెనక టైర్ ఊడిపోవడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే ఉంది. అనారోగ్య బాధితులను ఆస్పత్రికి తీసుకెళ్లే అంబులెన్స్‌పై అధికారులకు ఇంత నిర్లక్ష్యమా అంటూ పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో అత్యవసర పరిస్థితులు ఎదురైతే ఇతర మండలం నుంచి 108 వాహనం వచ్చే సరికి ఎంత ఆలస్యం కావాలంటూ, ముందు జాగ్రత్తలు పాటిస్తూ అత్యవసర సేవలు అందించాలని పలువురు కోరుతున్నారు.



రోడ్డుపైనే నిలిచిన 108 వాహనం

పరుచుకున్న పచ్చదనం

మహాముత్తారం: మహాముత్తారం నుంచి వజినేపల్లి వెళ్లే ప్రధాన రహదారి వెంబడి గతంలో అధికారులు అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా రోడ్డుకిరువైపులా మొక్కలు నాటారు. అవి ఏపుగా పెరిగి వృక్షాలు కావడంతో కొమ్మలు ఒకదానికి ఒకటి తగిలి అల్లుకోవడంతో పచ్చదనం పరుచుకున్నట్లు ఉంది. ఎండాకాలం కావడంతో ఈ రాహదారి నుంచి వెళ్లే బాటసారులు, వాహనదారులు చెట్లను చూసి మురిసిపోతున్నారు.



మహాముత్తారం వజినేపల్లి వెళ్లే దారిలో అల్లుకున్న చెట్లు

పరిహారం అందేలా కృషి



దగ్ధమైన పంటలను పరిశీలిస్తున్న అధికారులు

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని రేపాకలో గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బోయిని రాజయ్యకు చెందిన మొక్కజొన్న పంటతో పాటు, ఆయిల్ పాం పంట పూర్తిగా దగ్ధమైంది. దీంతో జిల్లా ఉద్యాన అధికారి సంజీవరావు, జిల్లా వ్యవసాయాధికారి విజయ్‌భాస్కర్ పంటలను శుక్రవారం పరిశీలించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు ఆట్లాడుతూ.. పంట నష్టాన్ని అంచనా వేసి రాష్ట్ర ఉన్నత అధికారులకు నివేదికను అందిస్తామని, ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా కృషి చేస్తామని రైతుకు భరోసా కల్పించారు. వారి వెంట సువెన్ ఆగ్రో ఇండస్ట్రీస్ కంపెనీ ప్రతినిధి యుగేందర్‌యాదవ్ ఉన్నారు.

హెల్మెట్ తప్పనిసరి



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్సై షాఖాన్

చిట్యాల: వాహనం నడిపే ప్రతి వాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్సై షాఖాన్ అన్నారు. శుక్రవారం మండలంలోని చల్లగరిగ గ్రామ శివారులో పోలీస్ సిబ్బందితో కలిసి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేపట్టారు. మండలంలో వాహనాలకు నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్నాయనే సమాచారం మేరకు వాటిపై ఆరా తీశారు. కొత్త వ్యక్తులు కనబడితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. డ్రంకన్ డ్రైవ్‌లో ఒకరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది లాల్‌సింగ్, అస్లాంజాని, తదితరులు ఉన్నారు.